రాష్ట్ర నీటివనరులకు సంబంధించిన వివాదాల మూలాలను చారిత్రకంగా చర్చించి తక్షణ ప్రత్యామ్నాయాన్ని సూచిస్తున్నారు **కె. బాలగోపాల్**

# జల రాజకీయాలు ప్రాంతీయ అసమానతలు

నీటి హక్కుల విషయంలో రాష్ట్రంలో అసమానత ఇవ్వాళ పుట్టింది కాదు. మొదటి నుండీ ఉంది. పులిచింతల, పోలవరం ప్రాజెక్టులు కట్టేస్తే అది స్థిరపడిపోతుంది. ఇప్పుడు ఆందోళన ఎక్కువ జరగడానికి కారణం ఏమిటంటే వై.ఎస్. రాజశేఖర రెడ్డి జలయజ్ఞం పేరిట ఉన్న నీటినే కాక ఊహించిన దాన్ని కూడ శాశ్వతంగా పంచేస్తున్నాడు. అతని పాలన అయిపోయే నాటికి ఇంక నీటి గురించి కొట్లాడుకోవడమే తప్ప మాట్లాడుకునేదేమీ ఉండదు. నీటి హక్కులు హేతుబద్ధంగా నిర్ధారించి ప్రాజెక్టులు కట్టేబదులు ప్రాజెక్టులు కట్టేసి వాటికి కేటాయించిన నీటి ప్రాతిపదికన హక్కులు నిర్ణయిస్తున్నాడు. దురదృష్టవశాత్తు తెలంగాణ, రాయలసీమల మధ్య విద్వేష వాతావరణం ఉండడం వల్ల దీనిని గురించి హేతుబద్ధమైన చర్చ జరిగే పరిస్థితి లేదు. ఆ విద్వేషాన్ని రాజశేఖరరెడ్డి పనిగట్టుకొని పెంచుతుండగా అది ఒక ఫాసిస్ట్ ఎత్తుగడ అని చూడలేని జనం అతను కోరుకున్నట్టే రెండుగాచీలి పరస్పరం ద్వేషించు కొంటున్నారు. ప్రజల మధ్య ఎన్ని చీలికలుంటే, ఆ చీలికలు ఎంత ద్వేషపూరితంగా ఉంటే, నాయకులు అంత భద్రంగా ఉంటారనేది ఫాక్షనిస్ట్ రాజకీయాల ప్రాథమిక సూత్రం. రాజశేఖర రెడ్డి దానిని సమర్థంగా అమలు చేసి అడుగడుగు ఎదిగాడు. అతను పైకిపోయేకొద్దీ రాష్ట్ర రాజకీయాలకు నష్టం అని తెలిసినవాళ్లం గుర్తించాం గానీ, రాష్ట్రంలో సాగునీటి హక్కులు దానికి బలవుతాయని ఊహించలేదు. నీటి హక్కులతో రాజశేఖరరెడ్డి ఆటలాడుకొంటుండగా కోస్తా జిల్లాల వాళ్లు మాకు దక్కేది దక్కేసిందని హాయిగా ఉన్నారు. తెలంగాణ వాళ్లు రాయలసీమను ద్వేషించడంలో సంతృప్తి చెందుతున్నారు. రాయలసీమ వాళ్లు రాజశేఖరరెడ్డి మీద ఈగవాలకుండ జాగ్రత్త పడుతున్నారు. ఇదే నిజం కాకపోతే, కరువు ప్రాంతాల ప్రాజెక్టులయిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు, శ్రీశైలం ఎడమ గట్టు కాలవకు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి, తెలుగు గంగకు, గాలేరు-నగరికి, హంద్రీ-నీవాకు, వెలుగొండకు ఇవ్వాళే కాదు ఎప్పటికీ నికర జలాలు అడగబోమని రెండవ కృష్ణా ట్రిబ్యునల్‌కు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం హామీ ఇచ్చి హాయిగా వెనక్కి వచ్చి ఉండేది కాదు. తెలంగాణ, రాయలసీమల మధ్య ఏకొంచెం సదవగాహన ఉన్నా ఈ పని చేసిన తరువాత రాజశేఖర రెడ్డి ప్రభుత్వానికి కంటిమీద కునుకు ఉండేది కాదు. ప్రత్యేక రాష్ట్రం సాధించి నీటి హక్కులు నెలకొల్పుకుంటాం అని తెలంగాణ వాళ్లు ఊరుకున్నారు. రాజశేఖరరెడ్డి దొడ్డిదారిన నీళ్లు తెస్తున్నాడు, అనవసరంగా మాట్లాడి దానిని పాడు చేయొద్దని రాయలసీమ వాళ్లు ఊరుకున్నారు.

ముగింపును ఉపోద్ఘాతంగా చెప్పడంలో ఉద్దేశ్యం ఏమిటని అడుగుతారేమో. ఈ ముగింపు వెలుగులోనే నీటి హక్కుల చరిత్రను చూడకతప్పదు కాబట్టి ఈ ఉపోద్ఘాతం అవసరం.

నీటి వనరుల మీద హక్కును ఏ విధంగా పంచడం న్యాయం అనే విషయంలో భారతదేశంలో ఒక విధానంగానీ, ప్రమాణం గానీ ఏదీ లేదు. ఎవరి నీటి వనరుల మీద వారికే మొదటి హక్కు ఉంటుంది అనేది చాల మందికి ఆకర్షణీయంగా తోచే ప్రమాణం. దాని ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే దోపిడీదారు. కృష్ణా, గోదావరి నదుల జలాలలో మన వాటాగా మనం పొందిన దానిలో చెప్పుకోదగ్గ మొత్తం ఇతర రాష్ట్రాలకు (ఈ అర్థంలో) చెందినది. కృష్ణా నదీ జలాలలో మన వాటా అయిన 800 టిఎంసిలలో దాదాపు 200 టిఎంసిలు కర్నాటకకు చెందినవి. గోదావరి మాటకొస్తే, మన రాష్ట్ర వాటా అయిన 1480 టిఎంసిలలో పెద్ద ఎత్తున ఛత్తీస్‌గడ్‌కూ, విదర్భకూ చెందినది. మన వాటా గురించి ఒప్పందం జరిగినప్పుడు ఛత్తీస్‌గడ్ అనే రాష్ట్రం లేదు. అది మధ్యప్రదేశ్‌లో భాగంగా ఉండేది. విదర్భ ఆనాడూ ఈనాడూ తన ప్రయోజనాలు తాను కాపాడుకునే అధికారం ఉన్న ప్రాంతం కాదు. ఈ రెండు ప్రాంతాలకూ ఆనాడు అటువంటి అధికారం ఉండి ఉంటే గోదావరి నదీ జలాలలో మనకింత వాటా దక్కేది కాదు. ప్రాంతాలవారీగా తెలుగువాళ్లం 'ఇవి మానీళ్లు' అంటే 'మానీళ్లు' అని కొట్లాడుకునేటప్పుడు అందులో చెప్పుకోదగ్గ మొత్తం మనెవ్వరిదీ కాదని గుర్తుంచుకుంటే ఆవేశాలు కొంచెం తగ్గుతాయేమో.

అయితే ఎవరి నీటి వనరుల మీద వారికే మొదటి హక్కు అనేది పైకి తోచినంత న్యాయమైన ప్రమాణం కాదు. వర్షపాతం తక్కువ ఉండి ఏ నదీ లేని ప్రాంతాలు ఉంటాయి. వారికి అందుబాట్లో ఉన్న నీటి వనరుల మీద మాత్రమే వారికి హక్కు ఉంటుందంటే వారెట్లా బతకాలి?

జీవించే హక్కు అందరికీ ఉంటుందనీ అందరికీ సమానంగా ఉంటుందనీ ఒప్పుకునేటట్లయితే నీరు ఒక అనివార్యమైన జీవిత అవసరం కాబట్టి నీటి మీద అందరికీ సమాన హక్కు ఉంటుందని అనవలసి ఉంటుంది. అంటే నీటి వనరులు ఎక్కువ ఉన్న ప్రాంతం నుండి తక్కువ ఉన్న ప్రాంతానికి నీటిని తరలించవలసి ఉంటుంది.

నీటికి మూలం వర్షం. అది మూడు రూపాలలో నిలువ ఉంటుంది. నేలలో తేమ, భూగర్భజలాలు, ఉపరితల జలాలు. ఉపరితల జలాలు ప్రకృతిసిద్ధమైన కుంటలలో, వాగులలో, నదులలోనే కాక, కృత్రిమంగా నిర్మించిన చెరువులు, డ్యాంలలోను అందు బాట్లో ఉంటాయి. వర్షపాతం తక్కువ ఉన్న ప్రాంతాలలో నేలలో తేమ తక్కువ నిలుస్తుంది. భూగర్భ జలమట్టం లోతున ఉంటుంది. తగు చర్యలు తీసుకుంటే వీటిని కొంత మెరుగుపరచ వచ్చును గానీ దానికి సహజ పరిమితులు ఉంటాయి. అందువల్ల ఉపరితల నీటి వనరులను పెంపొందించడం, అందుకోసం ఇతర ప్రాంతాల నీటి వనరులను తరలించడం అవసరం. నదీ జలాల ప్రాజెక్టులు దీనికొక సాధనం. వాటినుండి నేరుగా కాలవల ద్వారా నీళ్లు సరఫరా చేయొచ్చు, చెరువులు నిర్మించి వాటిని నింపవచ్చు. నదీజలాల ప్రాజెక్టులను అసమాన నీటి వనరులున్న ప్రాంతాల మధ్య సాధ్యమైన మేరకు సమానత్వాన్ని తీసుకొచ్చే సాధనాలుగా చూడడం ఉచితంగా ఉంటుంది.

కానీ నిజానికి నీటి హక్కుల పంపిణీకి ఇవేవీ ప్రమాణాలుగా లేవు. చారిత్రకంగా జరిగింది జరిగిపోగా ఆపైన రాజకీయ ప్రాబల్యం నిర్ణయాత్మకంగా ఉంది. కృష్ణా, గోదావరి నదులకు సంబంధించి, 19వ శతాబ్దం మధ్య భాగంలో బ్రిటిష్ వాళ్లు బెజవాడ దగ్గర, రాజమండ్రి దగ్గర కట్టిన మళ్లింపు పథకాలు మొదటి ప్రాజెక్టులు. అప్పట్లో సాగునీటి కంటే కూడ వరదల నియంత్రణ, కాలవల ద్వారా రవాణా ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యాలు. ఆ తరువాత తుంగభద్ర నది మీద సుంకేసుల వద్ద ఆనకట్టకట్టి కె.సి.కెనాల్ తవ్వారు. ఇది కడప, కర్నూలు జిల్లాలకు నీళ్లిస్తుంది. 1958లో దానికి ఎగువన రాజోలిబండ మళ్లింపు పథకం నిర్మించారు. ఇది మహబూబ్‌నగర్‌కు నీళ్లిస్తుంది. హోస్పేట్ దగ్గర కట్టిన టి.బి. డ్యాం కర్నాటకకు నీళ్లిస్తూ మన రాష్ట్రంలో అనంతపురం, కర్నూలు జిల్లాలకు ఎగువ కాలువ, దిగువ కాలువల ద్వారా నీళ్లిస్తుంది. ఆ తరువాత నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కట్టి ప్రధానంగా గుంటూరు, నల్గొండ జిల్లాలకు, కొంత ఖమ్మం, కృష్ణా, ప్రకాశం జిల్లాలకూ నీళ్లిచ్చారు.

అప్పటిదాకా కృష్ణా, గోదావరి నదుల వినియోగానికి సంబంధించి వివిధ పరీవాహక ప్రాంతాల మధ్య ఒప్పందంగానీ ట్రిబ్యునల్ ఆదేశం గానీ లేదు. నాగార్జునసాగర్ నిర్మాణాన్ని చేపట్టేటప్పటికి అప్పటి మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణా జలాల మీద ఆంధ్రప్రదేశ్ తన అర్హతకు మించిన హక్కులు నెలకొల్పుకుంటూ ఉందని సహేతుకమైన అభ్యంతరాలు లేవదీస్తున్నప్పటికీ పట్టించుకోకుండ ఆ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసేసుకున్నాం. ఈ ఘనకార్యం సాధించినందుకే ఆంధ్రులకు కె.ఎల్. రావు ఆరాధ్యుడయ్యారు.

రాష్ట్రంలోపల ప్రాంతీయ జల రాజకీయాలకు కూడ నాగార్జునసాగర్ నాంది పలికింది. మద్రాస్ రాష్ట్రం నుండి తెలుగు మాట్లాడే ప్రాంతాలను వేరు చేసి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలని కోస్తాజిల్లాలవాళ్లు ప్రతిపాదించినప్పుడు రాయలసీమవాళ్లు తటపటాయించారు. రాయలసీమ ప్రయోజనాలు ఆంధ్రుల పెత్తనం కంటే తమిళుల పెత్తనంలో మెరుగుగా ఉంటాయేమోనన్న సందేహం వారిలో ఉండింది. వారిని ఒప్పించడానికి 1937లో సర్కార్, రాయలసీమ పెద్దల మధ్య జరిగిన శ్రీబాగ్ ఒప్పందంలో కృష్ణా జలాల వినియోగంలో రాయలసీమ ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆ తరువాత తెలంగాణను కలుపుకొని విశాలాంధ్ర ఏర్పాటు చేయాలని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల వారు కోరుకున్నప్పుడు ఇంకా గట్టి ప్రతిఘటనే ఎదురయ్యింది. తెలంగాణ నాయకులను ఒప్పించడానికి 1956లో చేసుకున్న పెద్ద మనుషుల ఒప్పందంలో తెలంగాణలో నీటి పారుదలకు సంబంధించిన నిర్ణయాలన్నీ తెలంగాణ ప్రాంతీయ మండలే నిర్ణయిస్తుందని ఆంధ్ర, రాయలసీమ నాయకులు హామీ ఇచ్చారు. ఈ రెండు హామీలకూ సమన్వయం ఎట్లాకుదురుతుందని పెద్దలంతా భావించారో తెలీదుగానీ మొట్టమొదట కట్టిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ రెండిటికీ విరుద్ధంగా సాగింది. అది రాయలసీమకు చుక్కనీరివ్వదు. తెలంగాణ విషయానికొస్తే అంతకు ముందు నిజాం ప్రభుత్వం అదే ప్రాంతంలో నందికొండ ప్రాజెక్ట్ ప్రతిపాదించి ఉండింది. దాని కింద తెలంగాణ ప్రాంతంలో 7 లక్షల ఎకరాలకు, కృష్ణా జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవి. దానిని చేపట్టకుండ నాగార్జున సాగర్ ప్రాజెక్టులో ఎడమ కాలువకు సగం నీళ్లు, కుడికాలువకు సగం నీళ్లు కేటాయించారు. అయితే కుడికాలువ మొత్తం గుంటూరు, ప్రకాశం జిల్లాలకు పోతుండగా ఎడమకాలువ వాటాలో నాలుగవ వంతు మళ్లీ కృష్ణా జిల్లాకు కేటాయించబడింది.

అక్కడితో కృష్ణా నదీజలాలు ఆంధ్రప్రదేశ్ తీసుకోగలిగిన దానికంటే చాలా ఎక్కువ తీసేసుకొన్నట్టయింది. ఆ ఫిర్యాదే మైసూరు, మహారాష్ట్రలు చేయగా కేంద్ర ప్రభుత్వం అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం కింద బచావత్ ట్రిబ్యునల్‌ను నియమించింది. బచావత్ ట్రిబ్యునల్ ముందుకు మన పాలకులు పోయి తెలంగాణలోనూ రాయలసీమలోనూ ఉన్న కరువును ఏకరవు పెట్టి ఇంకా నీళ్లిమ్మని అడిగారు. అయితే కృష్ణా నదిలోని నీరొచ్చి చేరేది అధికంగా కర్నాటకలోని పడమటి కనుమల ప్రాంతంలో. మనం అప్పటికే వాడుకుంటున్న నీళ్లలో దాదాపు 200 టిఎంసిలు (ఏ ప్రాంతపు నీటి వనరులు ఆ ప్రాంతానికే చెందుతాయన్న సిద్ధాంతం ప్రాతిపదికన) 'వాళ్లవే'. అంతేకాక కర్నాటకలోనూ కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో పడమటి కనుమలను దాటికిందికి వస్తే కరువు దండిగానే ఉంది. కాబట్టి ఇంక ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం కష్టం అని భావించిన బచావత్ ట్రిబ్యునల్ ఒకే ఒక్క ప్రాజెక్టుకు నీటి కేటాయింపు చేసింది. అది మహబూబ్‌నగర్‌లోని జూరాల. 1970లో ప్రకటించిన బచావత్ అవార్డు 17.5 టిఎంసిల నీటి కేటాయింపుతో ఆమోదించిన ఈ ప్రాజెక్ట్ చాలా ఆలస్యంగా కట్టడమే కాక ఇప్పటికీ పూర్తి సామర్థ్యంతో నిర్మించలేదంటే ప్రాంతీయ వివక్షకు మహబూబ్‌నగర్ ఎంతగా బలయిందో అర్థం అవుతుంది. జూరాలను పూర్తిసామర్థ్యంతో నిర్మించినట్టయితే కర్నాటక భూములు మునుగుతాయని దానిని వాయిదా వేయడం జరుగుతున్నది. నీళ్లు వచ్చేది మహబూబ్‌నగర్‌కు కాక వేరే జిల్లాకయి ఉంటే ఆ ముంపుకు నష్టపరిహారం

తగుమాత్రం చెల్లించి కర్నాటకను ఒప్పించేవారు కాదా? ఒక్క జూరాల విషయంలోనే కాదు అన్ని రకాలుగానూ కృష్ణా జలాల వాడకంలో ప్రాంతీయ వివక్ష వల్ల ఏ రాయలసీమ జిల్లా కంటే కూడ ఎక్కువ నష్టపోయింది మహబూబ్‌నగర్. కృష్ణా నది పరీవాహక ప్రాంతం మహబూబ్‌నగర్‌లో ఎక్కువ ఉంది కాబట్టి ఆ నది నీటిలో ఎక్కువ వాటా ఆ జిల్లాకు రావాలన్న వాదన సమంజసమైనదని నేనుఅనుకోవడం లేదు. 'ఎవరి నీటి వనరులు వారివే' అనే వాదన పట్ల నా అభ్యంతరం మొదట్లోనే చెప్పాను. అయితే వర్షాభావప్రాంతం కాబట్టి మహబూబ్‌నగర్‌కు ఎట్లాగూ కృష్ణా నదీ జలాలు తగుమాత్రం దక్కవలసి ఉంటుంది. ఆ ప్రాతిపదికన కూడ మహబూబ్‌నగర్‌కు అందరికంటే అధికంగా అన్యాయం జరిగింది. అనంతపురం కూడ ఆ తరువాతే వస్తుంది.

పాత ప్రాజెక్ట్‌ల ఆధునీకరణలో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. కృష్ణా డెల్టా వర్క్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరించారు. మళ్లింపు పథకంగా ఉన్న దాని కట్ట ఎత్తు పెంచి రిజర్వాయర్ తయారు చేశారు. ఆ తరువాత కె.సి. కెనాల్‌ను కూడా సమగ్రంగా బాగు చేసారు. ఎత్తయిన కట్ట కట్టి కాలవలకు నీటి భరోసా ఇవ్వడమే కాక, శ్రీశైలం నుండి ఏ చట్టపరమైన అనుమతీ లేకుండ 10 టిఎంసిలు ఎస్కేప్ చానెల్ ద్వారా కె.సి. కెనాల్‌కు ఇవ్వసాగారు. హోస్పెట్‌లోని తుంగభద్ర డ్యాంలో పూడిక పెరగడం వల్ల తగినంత నీళ్లు రావడం లేదనీ అందువల్ల కె.సి. కెనాల్ వాటా ఈ విధంగా తీసుకోవలసి వచ్చిందనీ ఈ చర్యను సమర్థించుకున్నారు. బాగానే ఉంది. కానీ ఆ పూడిక వల్ల అనంతపురం జిల్లాకు నీళ్లిచ్చే ఏకైక కాలవ అయిన తుంగభద్ర ఎగువ కాలవలో కూడ ప్రవాహం తక్కువగా ఉంటున్నది. దానికి ఒక సమాంతర కాలవ తవ్వి ఆ లోటును భర్తీ చేయాలన్న ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. అది కర్నాటకకూ అవసరమే కాబట్టి వారు దానికి సమ్మతిస్తున్నారు. అయినా అది మాత్రం జరగదు. ఇక రాజోలిబండ కాడికొస్తే దాని ఆనకట్ట శిథిలావస్థ చేరుకొని చాలాకాలం అయింది. దాని ఆధునీకరణ ఇప్పటి దాకా చేపట్టకపోవడమే కాక, ఎక్కడెక్కడివో ఉన్నవీ లేనివీ అయ్యేవీ కానివీ అన్ని ప్రాజెక్ట్‌లనూ ఏకరవు పెట్టిన 'జలయజ్ఞం'లో దాని ఊసేలేదు.

బచావత్ అవార్డ్ నీటి హక్కుల నిర్ధారణ చేసిన తరువాత హక్కులు లేని నీటి గురించి తెలంగాణ, రాయలసీమల కొట్లాట మొదలయింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. బచావత్ అవార్డు కృష్ణా నదిలో 2060 టిఎంసిల నీటిపై హక్కులు నిర్ధారించింది. అది నాలుగింట మూడేళ్లు నదిలో సగటున అందుబాట్లో ఉండే నీరని అంచనా. దీనిని నికర జలం అంటారు. ఆపైన ఏవైనా నీళ్లు ఏ సంవత్సరమయినా ఉంటే (మిగులు జలాలు) ఆంధ్రప్రదేశ్ వాడుకోవచ్చును గానీ ఆ వాడకం ఆంధ్రప్రదేశ్‌కు హక్కులివ్వదని బచావత్ అవార్డ్ అనింది. ఈ మిగులు జలాలపైన దక్షిణ తెలంగాణకు నాలుగు, రాయలసీమకు మూడు, ప్రకాశం జిల్లాకు ఒకటి మొత్తం ఎనిమిది ప్రాజెక్ట్‌లకు హామీలు ఇచ్చి పదేపదే పునాది రాళ్లు వేసి 'జలయజ్ఞం' మొదలయిన తరువాత వేల కోట్లు కుమ్మరించి కట్టేస్తున్నారు మన పాలకులు. నిజంగా ఈ కరువు ప్రాంతాలకు న్యాయం చేసే ఉద్దేశ్యం ఉండి ఉంటే కృష్ణా డెల్టాకు రెండు పంటలకు బదులు ఒక పంటకే నీటిని పరిమితం చేసి సాగర్‌కు ఎగువ నుండి కృష్ణా డెల్టాకు పోయే 80 టిఎంసిల నికర జలాన్ని పైననే ఆపి ఉండవచ్చు. దానిని తెలంగాణ, రాయలసీమ జిల్లాల్లో అత్యవసరమైన రెండు ప్రాజెక్ట్‌లకు (కల్వకుర్తి, హంద్రీ-నీవా) చెరి 40 టిఎంసిల చొప్పున కేటాయించి ఉండవచ్చు. లేదా వాటికీ ప్రకాశం జిల్లా వెలుగొండ ప్రాజెక్ట్‌కూ తలా 25 టిఎంసిల చొప్పున కేటాయించి ఉండవచ్చు. తీవ్ర దుర్భిక్షం ఎదుర్కొంటున్న ప్రాంతాల కోసం ఈ మాత్రం కూడ చేయలేక పోవడం మన రాష్ట్ర రాజకీయాలలోని ప్రాంతీయ ఆధిపత్యానికొక తార్కాణం.

రాష్ట్రావతరణ తరువాత నికర జలాల హక్కులు నాగార్జున సాగర్ ద్వారాను, జూరాలకు బచావత్ అవార్డ్ ఇచ్చిన ఆమోదం ద్వారాను తెలంగాణకే కొంత దక్కగా ఆ తరువాత మిగులు జలాల రాజకీయంలో రాయలసీమదే కొంత మేరకు పైచేయి అయింది. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ ఈ మధ్య చేపట్టే దాకా తెలంగాణకు మిగులు జలాలు ఇవ్వలేదు. కడప జిల్లాకు మిగులు జలాలిచ్చే తెలుగు గంగ ఇరవై ఏళ్లనాడే మొదలయింది. (అదికూడ ఇప్పుడిప్పుడే పూర్తవుతున్నదనుకోండి). గాలేరు-నగరి పనులిప్పుడే వేగంగా పూర్తి అవుతున్నాయి. దానికి నీటి భద్రత కల్పించడం కోసం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచడమూ జరిగింది.

'రాయలసీమ' అంటున్నాం గానీ మిగులు జలాల రాజకీయాల వల్ల ప్రయోజనం పొందుతున్నదంతా పెన్న, కుందు నదుల పరీవాహక ప్రాంతమైన కర్నూలు జిల్లా పడమటి భాగం, కడప జిల్లా తూర్పు భాగం. తెలుగు గంగ, గాలేరు నగరీ నీళ్లిచ్చేది ఈ ప్రాంతానికే, అంతకు ముందు నుండి కె.సి.కెనాల్ వల్ల నీటి మీద, నికరమైన హక్కు ఉన్నదీ ఈ ప్రాంతానికే. పెన్న నది మీద మైలవరం ప్రాజెక్ట్ నీళ్లిచ్చేదీ ఈ ప్రాంతానికే. కేంద్ర జల సంఘం ద్వారా అనుమతి పొందిన శ్రీశైలం కుడిగట్టు కాలువ నీళ్లిచ్చేదీ ఈ ప్రాంతానికే. రాయలసీమలో ఇతర ప్రాంతాలకు 'రాయలసీమ' పేరుమీద జరిగిన సాగునీటి అభివృద్ధి వల్ల దక్కింది శూన్యం.

బచావత్ అవార్డ్‌లో ఒక్క జూరాల మాత్రమే కొత్తగా మంజీరయిన ప్రాజెక్ట్‌కాగా, కృష్ణాడెల్టాను, కె.సి.కెనాల్ ఆయకట్టునూ ఆధునీకరించామనీ మొత్తం 48 టిఎంసిల నీటిని ఆదా చేసామనీ చెప్పి కేంద్ర జల సంఘం నుండి మూడు ప్రాంతాలకూ మూడు ప్రాజెక్ట్‌లు మంజూరు చేయించుకుంది రాష్ట్ర ప్రభుత్వం. కోస్తా కోసం 9 టిఎంసిలతో పులిచింతల, రాయలసీమలో (పైన చెప్పిన) కర్నూలు-కడప సరిహద్దు ప్రాంతానికి 19 టిఎంసిలతో శ్రీశైలం కుడి గట్టు కాలవ (ఎస్ఆర్‌బిసి), తెలంగాణలో మహబూబ్‌నగర్‌కు 20 టిఎంసిలతో భీమా ఆమోదం పొందాయి. ఎస్ఆర్‌బిసి అన్నిటికంటే ముందు మొదలై దాదాపు పూర్తయి పోయింది. పులిచింతల అనేక అభ్యంతరాల మధ్య ఆలస్యంగా మొదలయి శరవేగంగా పూర్తవుతున్నది. భీమా మాత్రం ఇప్పుడిప్పుడే మొదలవుతున్నది. పైగా అది ఎత్తిపోతల పథకం కాబట్టి దాని గతి ఏమవుతుందో చెప్పడం కష్టం.

పులిచింతలకు 9 టిఎంసిల నికరజలం కేటాయింపు అప్పుడెప్పుడో జరిగిపోయింది గానీ తరువాత దాని పట్ల తెలంగాణ నుండి వ్యతిరేకత బలంగా వ్యక్తం అయింది. అది కేవలం డెల్టా స్థిరీకరణ ప్రాజెక్ట్. దాని కోసం 9 టిఎంసిల నికర జలం కేటాయించి బహుశా ఇంకొక 30 టిఎంసిల దాకా మిగులు జలం వాడుకోవడం ఎంతవరకు సబబు?

తెలుగుదేశం పాలనలోనే నిర్మించడం మొదలుపెట్టిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు సాగర్ నుండే ఆ 9 టిఎంసిలు కేటాయించినట్టయితే మునుగోడు, నారాయణపురం మండలాల ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు నికర జలాలు ఇయ్యవచ్చును కదా? అది ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం అవుతుంది కదా? అయితే ఏమైనా సరి పులిచింతల ప్రాజెక్ట్ కట్టి తీరవలసిందేనని కోస్తా జిల్లాల వాళ్లు పట్టుబట్టి సాధించుకున్నారు.

ఇక ప్రస్తుత వివాదాల విషయాని కొస్తే 2000లో బచావత్ అవార్డ్ గడువు ముగియగానే ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలపైన విపరీతంగా ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలపైన విపరీతంగా ప్రాజెక్టులు చేపడుతున్న దన్న కర్నాటక ఫిర్యాదు మేరకు కేంద్రప్రభుత్వం రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్ వేసింది. దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలలో ఆంధ్రప్రభుత్వం చేపడుతున్న అన్ని ప్రాజెక్టులను వెంటనే ఆపాలని కర్నాటక ట్రిబ్యునల్ నుండి మధ్యంతర ఆదేశం కోరింది. దానికి జవాబుగా మన ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు నీళ్ల హక్కు కోరబోమనీ నీళ్లు ఉన్నప్పుడు వాడుకోవడం మాత్రమే జరుగుతుందనీ హామీ ఇవ్వడంతో ట్రిబ్యునల్ కర్నాటక అర్జీని కొట్టివేసింది. దీనిని మన 'విజయం'గా పత్రికలు వర్ణించాయి గానీ దీని అర్థం ఏమిటంటే రెండవ కృష్ణా ట్రిబ్యునల్ అవార్డ్ అమలులో ఉన్నంతకాలం, కృష్ణా నదీ జలాల పైన కడుతున్న 8 ప్రాజెక్టులకూ ఒక హక్కుగా నీళ్లు తీసుకోలేమని. కరువు ప్రాంతాలైన దక్షిణ తెలంగాణ, రాయలసీమలకూ ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్‌కూ ఇంతకంటే ద్రోహం వేరే ఉండదు.

ట్రిబ్యునల్‌కు ఆ హామీ ఒక పక్క ఇస్తూ మరో పక్క గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని వైఎస్ ప్రభుత్వం భావిస్తున్నట్టు స్పష్టంగా ఉంది. ఇందులోని తప్పొప్పులను అట్లా ఉంచి, దానిని కనీసం న్యాయంగా వివరించే ప్రయత్నం సహితం వైఎస్ చేయడు. గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించి దక్షిణ తెలంగాణ, రాయలసీమల కోసం కడుతున్న మిగులు జలాల ప్రాజెక్టులకు నీటి హక్కు కల్పిస్తాం అని అనడు. 'కృష్ణా నది మిగులు జలాలు రాయలసీమకే. తెలంగాణకు గోదావరి జలాలే' అంటాడు. గోదావరి జలాలు కృష్ణా బేసిన్‌కు తరలించి ఆంధ్రప్రాంతానికి పంపించి, కృష్ణా జలాలన్నీ రాయలసీమకు తీసుకుపోతాడు అని తెలంగాణ వాసులకు అనుమానం వచ్చే పరిస్థితి కల్పిస్తాడు. వారికి ఆ అనుమానం వచ్చినందుకు నొచ్చుకోడు. అనుమానంరావడం, తెలంగాణ వాసులు రాయలసీమ పట్ల ద్వేషం మరింత పెంచుకోవడం, అతనికి కావాలి. అప్పుడే రాయలసీమ వాసులు తమకు వైఎస్ తప్ప దిక్కులేదని భావిస్తారు. హేతుబద్ధమైన సపోర్ట్ కూడ సపోర్టేనని రాజకీయాల గురించి ప్రజాస్వామికంగా ఆలోచించే వాళ్లు భావిస్తారు. భయంతో, అభద్రతతో వచ్చే సపోర్టే భద్రమైనదని ఫాక్షనిస్ట్ బుద్ధి భావిస్తుంది.

పోతే, 200 టిఎంసిల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి కృష్ణా బేసిన్‌లోని నికరజలాల లోటును భర్తీచేయాలని వైఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం చాలారకాలుగా అవాంఛనీయమైనది. గోదావరి నదిలో మన రాష్ట్రం వాటా అయిన 1480 టిఎంసిలలో ఇంకా 680 టిఎంసి మిగిలిఉన్నాయని అంచనా. పోలవరం ద్వారా అందులో 80 టిఎంసిలు కృష్ణా బేసిన్‌కు, విద్యుదుత్పత్తికీ పశ్చిమ గోదావరి కృష్ణా జిల్లాలలో వ్యవసాయ భూములకూ, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలలో పరిశ్రమల అవసరాలకు 245 టిఎంసిలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతానికి ఇంకా ఇంత నీళ్లెందుకు కేటాయించాలన్న ప్రశ్నకు ఏజవాబు చెప్పకుండా కాలువలు తవ్వుకుంటూ పోతున్నారు. దుమ్ముగూడెం ద్వారా ఇంకొక 100 టిఎంసిలు కృష్ణా బేసిన్‌కు తరలిస్తున్నారు. అంటే 680లో 245 కోస్తా జిల్లాలకు, జలవిద్యుత్ ఉత్పత్తికి, పోగా 200 కృష్ణా బేసిన్‌కు తరలిస్తే పరీవాహక ప్రాంతమైన ఆరు ఉత్తర తెలంగాణ జిల్లాల అవసరాలకు 235 టిఎంసిలు మిగులుతాయి. ఇది ఆ ఆరు జిల్లాల అవసరాలకు సరిపోదు. పోనీ ఆనీళ్లైమైనా గ్రావిటీ ద్వారా తీసుకునేదా అంటే కాదు. ఇంద్రావతి సంగమ స్థలం తరువాత గోదావరి ప్రవాహ మట్టం 80-90 మీటర్లు ఉండగా ఆ నీరు అందియ్యవలసిన వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల మెట్ట భూములు 300 నుండి 500 మీటర్లు ఎత్తున ఉన్నాయి. అంటే ఏ రకంగా ఆ నీళ్లు తీసుకున్నా గణనీయంగా ఎత్తిపోతల ప్రాజెక్టులు కట్టవలసి ఉంటుంది. ఎత్తిపోతల పథకాల నిర్మాణానికయ్యే ఖర్చే కాక, వాటి నిర్వహణకు నిత్యం కరెంట్ ఖర్చవుతుంది. ఎత్తిపోతల ద్వారా తీసుకున్న నీటిని తాత్కాలికంగా నిలువ ఉంచడానికి చాలా చెరువులు కట్టే ఆలోచన కూడా ఉన్నట్టుంది. ఇది ఖర్చుతోసహా చాలా సమస్యలతో కూడుకున్న విషయం. గోదావరి బేసిన్‌లో నీటి పారుదల పైన ప్రభుత్వం పెట్టదలచుకున్న ఖర్చు మొదట పరీవాహక ప్రాంత అవసరాల మీద పెట్టక కోస్తా జిల్లాల అవసరాలకు, కృష్ణా బేసిన్‌కు తరలింపుకు పెడితే ఆ తరువాత నిధులు లేవని చేతులెత్తేస్తే ఉత్తర తెలంగాణా గతేమిటన్న సందేహం సహజంగా వస్తుంది.

మరొక తీవ్రమైన అభ్యంతరం కూడా ఉంది. గోదావరి బేసిన్ నుండి కృష్ణా బేసిన్‌కు తరలించే నీరు కృష్ణా జలాలో భాగం అవుతుంది కాబట్టి ఆ 200 టిఎంసిలలో కర్నాటకకూ, మహారాష్ట్రకూ వాటా ఇయ్యవలసి ఉంటుంది ఈ విషయం బచావత్ అవార్డు స్పష్టం చేసింది. అంటే తరలించిన 200 టిఎంసిలలో 90 టిఎంసిల దాకా వారికి ఇచ్చేయవలసి ఉంటుంది. 110 మాత్రం మనకు మిగులుతాయి. పైగా ఆ 90 టిఎంసిలను ఆ రాష్ట్రాలు ఎగువన ఆపేసుకుంటాయి కాబట్టి సాధారణ సంవత్సరాలలో కాకున్నా వర్షాభావ సంవత్సరాలలో మన రాష్ట్రంలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులలో మొదటివైన భీమా, జూరాల, రాజోలిబండ, తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువలకు దెబ్బతగిలే ప్రమాదం ఉంది. అంటే బేసిన్ తరలింపు తెలంగాణ, రాయలసీమల మేలు కోసం అని చెప్పుకుంటున్నప్పటికీ తెలంగాణ, రాయలసీమలకు చాలా నష్టం కలిగే ప్రమాదం ఉంది.

మరి ప్రత్యామ్నాయం లేదా అంటే ఉంది. కృష్ణా డెల్టా కెటాయింపులు 80 టిఎంసిలు తగ్గించి సాగర్ కు ఎగువన నిలుపుకొని, నికర జలాల గుర్తింపుకు నాలుగింట మూడు సంవత్సరాలలో లభ్యతను కాక అయిదింట మూడు సంవత్సరాలలో లభ్యతను ప్రమాణంగా పెట్టుకుటే కోస్తా జిల్లాల ప్రాజెక్టులకు నీటి కెటాయింపు, నీటి భరోసా తగ్గినప్పటికీ అదే తగ్గిన నీటిభరోసాతో మొదట్లో పేర్కొన్న 8 ప్రాజెక్టులు కట్టుకోవచ్చు. కానీ కోస్తాంధ్ర వాసులు దీనికి అంగీకరిస్తారా? వారినెవరైనా అంగీకరింప జేయగలరా? ◆